
క్లుప్తంగా

ఘనంగా సీతారామచంద్ర స్వామి పట్టాభిషేకం



నందిగామ రూరల్: పట్టణంలోని వేంచేసి యున్న సీతారామాంజనేయస్వామి వారి ఆలయంలో శ్రీరామ నవమి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ మహోత్సవాలలో భాగంగా సోమవారం సీతారామ చంద్ర స్వామి వారి పట్టాభిషేకం కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు దివి వంశీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో వైఖానస సాంప్రదాయం ప్రకారం పలురకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన కళ్యాణవేదికపై వేద మంత్రోచ్చరణల నడుమ సీతారామచంద్ర స్వామి పట్టాభిషేకాన్ని అత్యంత వైభవంగా జరిపించారు. అనంతరం స్వామివారికి పుష్పయాగాన్ని కన్నులపండువగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 13 అర్జీలు




నందిగామ టౌన్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఆయా సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు, అధికారులకు 13అర్జీలు అందజేశారు. ఈసందర్భంగా ఆర్డీఓ కె. బాలకృష్ణ మాట్లాడుతూ రెవెన్యూశాఖకు సంబంధించి ఎనిమిది అర్జీలు అందాయన్నారు. పంచాయతీరాజ్, పోలీసు, వైద్యశాఖ, మున్సిపాలిటీకి సంబంధించి ఇతర అర్జీలు అందినట్లు వివరించారు. అర్జీలను ఆయా శాఖల అధికారులకు పంపించి త్వరితగతిన పరిష్కారమయ్యేలా చూస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య అవగాహన ర్యాలీ



బూచవరం(జగ్గయ్యపేట): ప్రతిఒక్కరు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రభుత్వ వైద్యుడు ఎస్.అనీల్‌కుమార్ సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం గ్రామంలో వైద్య సిబ్బందితో ఆరోగ్య అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరు వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాయమాలు, యోగా కోసం కొంత సమయం కేటాయించాలన్నారు. ప్రస్తుత రోజుల్లో 30ఏళ్లకే గుండె సంబంధిత వ్యాధులు వస్తున్నాయని వాటి నియంత్రణకు ఆరోగ్య నియమాలు పాటించాలన్నారు. తగిన పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది లక్ష్మి, శివలీల, రాధ, ఫార్మాసిస్ట్ అనీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బలుసుపాడు గ్రామంలో వైద్యాధికారిణి స్రవంతి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



జగ్గయ్యపేట అర్బన్: భీమవరం బార్ అసోసియేషన్ న్యాయవాది బంటుమిల్లి కృష్ణపై దుండగులు అత్యంత కిరాతకంగా దాడి చేయడాన్ని ఖండిస్తూ జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ చట్టం అమలుకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు, న్యాయవాదులు ఎం.గోపీనాధ్, బడే జోగింద్రకుమార్, ఎం.ఆంజనేయులు, రావూరి ప్రసాద్, కరిసె రత్నబాబు, గంటా కృష్ణంరాజు, శ్రీధర్, చిన్నగాంధీ, అంకమరాజు, బిక్షమయ్య, డి.కరుణాకర్, రాజశేఖర్, గురువుల రాజు పాల్గొన్నారు.

రేపు పేటలో ప్రజాదర్బార్

జగ్గయ్యపేట అర్బన్: ఈనెల 9వ తేదీన స్థానిక ఉక్కు కళావేదికలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు సోమవారం తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 31 వార్డులకు సంబంధించి బుధవారం ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రజాదర్బార్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తాతయ్య, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర పాల్గొని పట్టణప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ఆయా సమస్యలపై అర్జీలు అందజేయాలని కమిషనర్ సూచించారు.


11నుంచి తిరుమలగిరి బ్రహ్మోత్సవాలు

12వతేదీన శ్రీవారి కల్యాణం

తిరుమలగిరి(జగ్గయ్యపేట): ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమలగిరి వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈనెల 11 నుంచి 16 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రాష్ట్ర సరిహద్దులో ఉండటంతో ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో రానుండటంతో అధికారులు భక్తులకు కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తున్నారు. ముఖ్యంగా ఆలయం వద్ద చలువ పందిళ్లు, తాగునీరు, ఆలయానికి విద్యుత్ దీపాలంకరణ, ప్రసాదాల ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద పారిశుద్ధ్య పనులకు ప్రత్యేక సిబ్బందిని నియమించారు. ఆరు రోజుల పాటు జరగనున్న బ్రహ్మోత్సవాలలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పాలకవర్గం, అర్చకులు, వేద పండితుల సూచనల మేరకు అధికారులు అన్ని వసతులు ఏర్పాట్లు చేస్తున్నారు.

చురుగ్గా ఏర్పాట్లు..

బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు సేద తీరేందుకు చలువు పందిళ్లు, తాగునీటి కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఎండ ఎక్కువగా ఉండటంతో ఆలయ ప్రాంగణంలో భక్తులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నారు. స్వామి వారి కల్యాణం రోజు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో రానుండటంతో కళ్యాణ వేదిక వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ఏర్పాటు పనులు సాగుతున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రత్యేక వేదికలు ఏర్పాటు చేస్తున్నారు. కల్యాణ వేదికను కూడా సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే చిల్లకల్లు, జగ్గయ్యపేట కూడళ్ల స్వామి వారి కల్యాణోత్సవాలకు భక్తులకు ఆహ్వానం పలుకుతూ స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు.



తిరుమలగిరిలోని వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి ఆలయం

కల్యాణోత్సవాలు వివరాలు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 11వతేదీన స్వామివారిని పెండ్లి కుమారుని చేయడం, దీక్షా స్వాముల ఇరుముడి సమర్పణ, వాస్తుపూజ, వాస్తు హోమం, ధ్వజారోహణం, 12న రాత్రి తొమ్మిది గంటలకు స్వామి వారి కల్యాణం, మధ్యాహ్నం భారీ అన్నదానం, 13న రాత్రి రథోత్సవం, నిత్యహోమం, బలిహరణ, 14న హోమం, బలిహరణ, సప్తకలశస్నాపనం, 15న వసంతోత్సవం-పూర్ణాహుతి, ధ్వజారోహణం, 16న పవళింపు సేవతో ఉత్సవాలు ముగియనున్నాయి. అంతేకాకుండా చివరి రోజు పూజా కుంకుమతో మహిళా భక్తులకు కుంకుమ భరిణలు అందించనున్నారు.

ఆలయానికి చేరుకొనే మార్గాలు..

జగ్గయ్యపేట నుంచి చిల్లకల్లు మీదుగా తిరుమలగిరికి బస్సు, ఆటో సౌకర్యం ఉంది. 24 గంటల పాటు ఆటోలు రాకపోకలు సాగిస్తుంటాయి. అంతే కాకుండా ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది.

> **భక్తులకు ఇబ్బంది లేకండా ఏర్పాట్లు..**
>
> బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. ముఖ్యంగా వేసవి కాలం దృష్ట్యా ఆలయం వద్ద తాగునీటి కొరత లేకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. మజ్జిగ పంపిణీ చేస్తాం. దాతల సహాయంతో కూలర్లు ఏర్పాటు చేస్తున్నాం. అదే విధంగా కళ్యాణ వేదిక వద్ద కూడా ప్రతి ఒక్కరు కల్యాణం చూసేలా తగిన చర్యలు తీసుకుంటున్నాం.
>
> -ఎం.కె.టి.ఎన్.వరప్రసాద్, ఆలయ సహాయక కమిషనర్

వక్ఫ్ చట్ట సవరణ రాజ్యాంగ విరుద్ధం

తన్నీరు నాగేశ్వరరావు

జగ్గయ్యపేటఅర్బన్: వక్ఫ్ చట్టానికి సవరణలు చేయడం ద్వారా ఎన్‌డీఏ ప్రభుత్వం రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధంగా వ్యవహరించిందని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు విమర్శించారు. ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రానున్న ఎన్నికల్లో ముస్లింలు తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన స్థానిక ముస్లిం నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తన్నీరు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు ముందు ముస్లింలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీలు ఇచ్చి, తీరా అధికారంలోకి వచ్చాక ముస్లింకు వెన్నుపోటు పొడిచిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి భవిష్యత్‌లో ముస్లింల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. వక్ఫ్ బిల్లును వ్యతిరేకించడం ద్వారా ముస్లింలకు వైఎస్సార్ సీపీ అండగా నిలిచిందన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించగా, ఆయన తనయుడు మాజీసీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఉప ముఖ్యమంత్రి పదవితోపాటు అనేక పదవులు కేటాయించి ముస్లింల పక్షపాతిగా నిలిచారని గుర్తుచేశారు. ముస్లింకు మంచి జరగాలంటే అది కేవలం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని తెలియజేశారు. ఈ వక్ఫ్ బిల్లును రద్దు చేసేంత వరకు ఉద్యమాలు, పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ హఫీజున్నీసా ఫిరోజ్, పార్టీ జిల్లా కార్యదర్శి, మాజీ జిల్లా వక్ఫ్ బోర్డు కార్యదర్శి షేక్ జుబేర్, పార్టీ మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ రన్‌హుస్సేన్, మైనార్టీ నాయకులు షేక్ మీరా సాహెబ్, షేక్ బాజీ తదితరులు మాట్లాడుతూ ముస్లింల హక్కుల విషయంలో కేంద్రంలో ఎన్డీఏ కూటమి, ఇక్కడి రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాలను దుయ్యబట్టారు. కార్యక్రమంలో పట్టణ సోషల్ మీడియా కోఆర్డినేటర్ సయ్యద్‌ఆలీ, పట్టణ వలంటీర్ విభాగం అధ్యక్షుడు షేక్ ఇమ్రాన్, ముస్లిం నాయకులు షేక్ లాల్‌జాన్, షేక్ జాని, షేక్ ఆసీఫ్, షేక్ మహ్మద్, షేక్ రియాజ్, షేక్ అహ్మద్, షేక్ గౌస్, షేక్ ఖాదర్, షేక్ జలీల్, షేక్ నాగుల్‌మీరా, షేక్ ఘనీ, రాష్ట్ర ఎస్టీసెల్ నాయకుడు బద్దూనాయక్, నియోజకవర్గ ఎస్టీసెల్ అధ్యక్షుడు బాణావత్ రాజు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు జవ్వాజి నరసింహారావు, ఏఎంసీ మాజీ డైరెక్టర్లు పింగళి నర్సింహారెడ్డి, మన్నె అప్పారావు, పట్టణ యూత్ అధ్యక్షుడు రామిని ఉపేందర్‌రెడ్డి, పట్టణ యూత్ ప్రధాన కార్యదర్శి గొట్టిపాళ్ల సురేష్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసగౌడ్, కరిసె ఇశ్రాయేలు, నాయకులు దివ్వెల రామారావు, మారిశెట్టి అనిల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు, పక్కన ముస్లిం నాయకులు

నాయకులకు సత్కారం

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట పట్టణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు నాయకులు మరింత కృషి చేయాలని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీకార్యాలయంలో సోమవారం ఆయన వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట పట్టణ ఉపాధ్యక్షుడుగా నియమితులైన దివ్వెల రామారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి పింగళి నర్సింహారెడ్డి, పట్టణ కార్యదర్శిగా నియమితులైన దార్ల ప్రసన్నకుమార్‌లను దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్ , మండల పార్టీ అధ్యక్షుడు బూడిద నరసింహారావు, పార్టీ రాష్ట్ర ఎస్టీసెల్ నాయకుడు లాహోరి బద్దూనాయక్, విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ నంబూరి రవి, న్యాయవాది పసుపులేటి సత్యశ్రీనివాస్, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ మన్నె అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



పట్టణ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, వట్టెం మనోహర్ తదితరులు

వర్మీ కంపోస్టు తయారీ పరిశీలన

గండేపల్లి(కంచికచర్ల) : మండలంలోని గండేపల్లిలో చెత్త సంపద కేంద్రంలో సోమవారం తడి, పొడిచెత్తను వేరుచేసి తొట్లలో నింపారు. ఈ కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్ పర్యవేక్షించారు. ఈసందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ క్లాప్‌మిత్రలు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సేకరించిన చెత్తను వేరు చేసి వర్మీ కంపోస్టు తయారీ కోసం తొట్లలో నింపినట్లు వివరించారు. ఈ వర్మీ కంపోస్టు ఎరువును రైతులకు సరఫరా చేస్తామని వివరించారు.



ఘనంగా గ్రాడ్యుయేషన్ వేడుకలు

కీసర(కంచికచర్ల) :విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని బీజేటీ డిగ్రీ కళాశాల డీన్ దుగ్గిరాల ప్రకాష్ సూచించారు. మండలంలోని కీసర లసాల్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో సోమవారం గ్రాడ్యుయేషన్ డే సెలబ్రేషన్స్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రకాష్ మాట్లాడుతూ చిన్నతనం నుంచి క్రమశిక్షణ, మంచి అలవాట్లు నేర్చుకోవాలన్నారు. ముఖ్యంగా ఆంగ్లబాషలో మంచి ప్రావీణ్యం పొందితేనే జీవితం పూలబాట అవుతుందన్నారు. ఉపాధ్యాయులు పాఠశాలలో చెప్పే పాఠాలను శ్రద్ధగా వింటే మంచి ఫలితాలు వస్తాయని వివరించారచు. పాఠశాల సెక్రటరీ బ్రదర్ థామస్ మైకేల్ మాట్లాడుతూ తల్లిదండ్రులను ప్రేమించే పిల్లలు అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారని వారి జీవన ప్రమాణాలు పెరుగుతాయని తెలిపారు. జీవితంలో అనుకున్నది సాధించాలంటే చదువు ఒక్కటే సరైన మార్గమన్నారు. విద్య ద్వారానే అన్ని రంగాల్లో రాణించవచ్చని పేర్కొన్నారు. చదువుతోపాటు క్రీడారంగంలో కూడా రాణించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్, థాంసన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నేడు

కంచికచర్ల : వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణాల మంజూరుకు దరఖాస్తు చేసుకున్నవారికి మంగళ, బుధవారాల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బిఎం విజయలక్ష్మి సోమవారం తెలిపారు. బీసీ కార్పొరేషన్, ఈబీసీ, రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు కార్పొరేషన్లుకు దరఖాస్తు చేసుకున్న వారు విధిగా ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యేవారు తప్పకుండా ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలని సూచించారు.

వత్సవాయి మండలంలో...

వత్సవాయి : ఆయా కార్పొరేషన్ల కింద రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నవారికి మంగళవారం దరఖాస్తులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎన్.రాంబాబు తెలిపారు. దరఖాస్తుదారులు షెడ్యూలు ప్రకారం హాజరుకావాలని కోరారు. ఉదయం పది గంటల నుంచి భీమవరం, మక్కపేట, చిన్నమోదుగపల్లి, చిట్టేల, దేచుపాలెం, గోపినేనిపాలెం, కన్నెవీడు, ఇందుగపల్లి, మంగొల్లు, పెద్దమోదుగపల్లి, రామచంద్రాపురం, శింగవరం గ్రామాలకు చెందినవారు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి పోలంపల్లి, దబ్బాకుపల్లి, వత్సవాయి, పోచవరం, లింగాల, పెంట్యాలవారిగూడెం, ఆళ్లూరుపాడు, తాళ్లూరు, వేమవరం, కంభంపాడు, మాచినేనిపాలెం, కాకరవాయి, వేములనర్వ గ్రామాలకు చెందిన దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీఓ వివరించారు.

రేపు పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తుల పరిశలన, ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జి శ్రీను సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అనిగండ్లపాడు, గుమ్మడిదుర్రు. శివాపురం, ముచ్చింతాల, పెనుగంచిప్రోలు, లింగగూడెం, కొళ్లికూళ్ల, ముండ్లపాడు గ్రామాల దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. మధాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సుబ్బాయిగూడెం, శనగపాడు, నవాబుపేట, తోటచర్ల, కొణకంచి, వెంగనాయకునిపాలెం, వెంకటాపురం గ్రామాలకు చెందిన వారి ఇంటర్వ్యూ చేస్తామని వివరించారు. దరఖాస్తుదారులు ఆయా సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

మహిళను కాపాడిన పోలీస్, ఫైర్ సిబ్బంది



కంచికచర్ల : ఓ మహిళ వ్యవసాయకూలీ సోమవారం బైపాస్‌లో బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు డ్రైయినేజీలో పడిపోవడంతో ఆమెను పోలీసులు, అగ్నిమాపకకేంద్ర సిబ్బంది కాపాడారు. పోలీసుల కథనం మేరకు.. వీరులపాడు మండలం అల్లూరు గ్రామానికి చెందిన పిల్లి సుశీలమ్మ అనే మహిళ వ్యవసాయ పనుల కోసం కంచికచర్ల వచ్చింది. బహిర్భూమికి అని బైపాస్ రోడ్డుపై వెళ్లగా డ్రైయినేజీలో కాలు జారి పడిపోయింది. గమనించిన చుట్టుపక్కల వారు పోలీసులు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని డ్రైయినేజీలోకి దిగి ఆమెను బయటకు తీసి రక్షించారు.

ఆస్తి పన్ను చెల్లింపుపై ఐదుశాతం రాయితీ

నందిగామరూరల్: పురపాలక సంఘం పరిధిలో 2025-26 మొదటి, రెండో అర్ధ సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను బకాయిలు వన్‌టైం సెటిల్‌మెంట్ పద్ధతిన చెల్లించినవారికి ఐదు శాతం రాయితీ సదుపాయం కల్పిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమణబాబు తెలిపారు. తన కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఆస్తి పన్నుల వివరాలను తెలుసుకునేందుకు మున్సిపల్ కార్యాలయ సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు సెలవు రోజుల్లో కూడా పురపాలక సంఘ కార్యాలయంలోని పురసేవ కౌంటర్‌లో పన్నులు కట్టించుకుంటున్నట్లు తెలిపారు. నందిగామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పన్నులను సకాలంలో చెల్లించి నందిగామ పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు.



నేటి నుంచి శిశు ఆధార్ క్యాంపులు

వత్సవాయి : మండలంలో మంగళవారం నుంచి ప్రత్యేక శిశు ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎన్.రాంబాబు సోమవారం తెలిపారు. మండలంలోని కన్నెవీడు, లింగాల గ్రామాల్లో మంగళవారం ఆధార్ క్యాంపు ఉంటుందన్నారు. 9వతేదీ బుధవారం మక్కపేట వేమవరం, 10న మంగొల్లు, కంభంపాడు, 11న భీమవరం, కాకరవాయి గ్రామాల్లో సచివాలయాల వద్ద క్యాంపులు నిర్వహిస్తామన్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారుల ఆధార్ కార్డుల్లోని తప్పులను సరిచేయించుకునేందుకు ఈ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు.

వేసవి దుక్కులతో ప్రయోజనాలు మెండు



కృష్ణంరాజు

నందిగామరూరల్/పెనుగంచిప్రోలు: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పత్తి, మిర్చి, మొక్కజొన్న పంటలు పూర్తికావడంతో రైతులు గత పంట తాలూకు అవశేషాలను తొలగించి వేసవి దుక్కులకు పంట పొలాలను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే పొలాలను సిద్ధం చేసిన రైతులు దుక్కులు దున్నే పనులకు శ్రీకారం చుడుతున్నారు. భారతీయ వ్యవసాయంలో వేసవి దుక్కులకు అధిక ప్రాధాన్యత ఉంది. రెండు రోజుల కిందట కురిసిన ఓ మోస్తరు వర్షంతో నేలతడిగా మారడంతో రైతులు తమ సాగు భూముల్లో వేసవి దుక్కులు దున్నే పనిలో నిమగ్నమయ్యారు. వేసవి దుక్కులు దున్నడం ద్వారా భూమిలోని పంటకు కీడు చేసే పురుగులు, కీటకాలు నశించటంతో పాటు భూమి సారవంతంగా మారుతుందని పంటల సాగులో పెట్టుబడి ఖర్చులు తగ్గి దిగుబడులు పెరుగుతాయని గరికపాడు వ్యవసాయ పరిశోధనాస్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కృష్ణంరాజు పేర్కొన్నారు.



అడవిరావులపాడులో ట్రాక్టర్‌తో వేసవి దుక్కులు దున్నుతున్న రైతు

వేసవి దుక్కుల ప్రయోజనాలు..

- వేసవి కాలంలో దుక్కులు దున్నితే భూమిలో తేమను నింపుకునే శక్తి పెరుగుతుంది.
- భూమిలోని గడ్డి పొరలు విడిపోయి భూమి గుల్లబారుతుంది.
- సూక్ష్మజీవులు, వానపాములు పెరిగి సేంద్రియ ఎరువులు వృద్ధి చెందుతాయి.
- భూమి సారవంతమవుతుంది. కలుపు మొక్కలు నశిస్తాయి. తద్వారా ఖర్చులు కూడా తగ్గుతాయి.
- దుక్కులు దున్నడంతో పురుగులు పైకి వచ్చి పక్షులకు ఆహారం కావడం లేదా ఎండకు చనిపోయే అవకాశం ఉంటుంది.
- శిలీంధ్ర బీజాలు సైతం భూమి లోపల పొరల నుంచి బయటకు వస్తాయి.
- క్షారాలు, లవణాలు భూమి లోపలి పొరలకు చేరుకుని పైభాగం సరైన పీహెచ్‌లో ఉంటుంది.
- గత పంటలకు సంబంధించిన మొక్కలు, వేళ్లు భూమిలో కూరుకుపోయి ఎరువుగా మారుతాయి. ఎలుకల బెడద కూడా తగ్గుతుంది.
- ముఖ్యంగా వాలుకు అడ్డంగా దుక్కులు దున్నడం ద్వారా భూమి కోతకు గురి కాకుండా ఉంటుంది.
- దుక్కులు దున్నకుండా వదిలేస్తే కలుపు మొక్కలు పెరిగి నేలలోని నీటిని, పోషకాలను లాగేసుకుని పంట సమయానికి భూమిని నిస్సారంగా మారుస్తాయి. దుక్కులు దున్నడం ద్వారా ఈ పరిస్థితి మారుతుంది.
- ముందుగానే దుక్కులు దున్నుకుంటే వానాకాలంలో పంటలు వేసుకునేందుకు మార్గం సుగమం అవుతుంది.
- వేసవిలో దుక్కులు దున్నడం వలన కురిసే అకాల వర్షాలను ఉపయోగించుకుని నేల తడిగా మారిన తరువాత కనీసం 25 నుంచి 30 సెంటీమీటర్ల లోతుకు దుక్కులు దున్నుకోవాలి. ఈ దుక్కుల కోసం ప్రత్యేకంగా రెక్క నాగలి, పల్లపు నాగలి ఉపయోగించుకోవాలి.
- దుక్కులకు యంత్రాలను వాడితే డిస్క్ టిల్లర్, రోటవేటర్లు వినియోగించాలి.
- చెరువు మట్టి కలిపి దున్నుకోవడం, కంపోస్టుతోపాటు పచ్చిరొట్ట ఆకులు కలిపితే అవి కుళ్లిపోయి మంచి ఎరువుగా మారుతుంది.

బూడిద మయం



జి.కొండూరు: ఇబ్రహీంపట్నంలో సోమవారం సాయంత్రం వీచిన పెనుగాలులకు వీటీపీఎస్ బూడిద విధ్వంసం సృష్టించింది. ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లో డంప్ చేసిన బూడిద పట్టణాన్ని మబ్బులా కమ్మేసింది. గాలితో కలిసి బూడిద కమ్మేయడంతో వాహనదారులు నరకయాతన పడ్డారు. బూడిద ఇళ్లలోకి సైతం చేరడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. కొద్ది సమయం పట్టణంలో ఏం జరుగుతుందో అర్థంకాక స్థానికులు ఆందోళన చెందారు.

ఈదురుగాలులతో కూడిన చిరుజల్లులు



వీరులపాడు: అకాల వర్షాల నేపథ్యంలో పంటలను కాపాడుకునేందుకు రైతులు నానాపాట్లు పడుతున్నారు. మండలంలో సోమవారం సాయంత్రం వరకు ఎండ వేడిమి ఉన్నప్పటికీ రాత్రి సమయంలో ఒక్కసారగా ఆకాశం మేఘావృతమై ఈదురుగాలులతో కూడిన చిరుజల్లులు కురిశాయి. దీంతో కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం, మొక్కొజొన్న పంటలను కాపాడుకునేందుకు రైతులు ఉరుకులు పరుగులు పెట్టారు. పట్టలు కప్పి ఆరుగాలం పండించిన పంటలను కాపాడుకునే ప్రయత్నం చేశారు. ఇప్పటికే రబీ సీజన్‌లో సాగు చేసిన వరి పంట సైతం ఈదురుగాలులకు నేలవాలుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఎన్నో లాభాలు

పెనుగంచిప్రోలు: ప్రకృతి వ్యవసాయంతో ఎన్నో లాభాలు ఉన్నాయని ప్రకృతి వ్యవసాయ విభాగం నియోజకవర్గ మాస్టర్ ట్రినర్ వన్నూరప్ప పేర్కొన్నారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల నుంచి ప్రకృతి వ్యవసాయం రైతులతో చేయించటానికి మొదటగా 25 నుంచి 30 రకాల విత్తనాలు తీసుకుని ఎకరానికి 13 కిలోలు చొప్పున భూమిలో చల్లుకోవాలన్నారు. తొలకరి జల్లులు పడటానికి ముందే ఈవిత్తనాలు బీజామృతంతో విత్తనశుద్ధి చేసి పొలంలో చల్లుకోవడం ద్వారా 41 రోజుల తరువాత ఆగడ్డి పశువులకు మంచి దాణాగా ఉపయోగ పడుతుందన్నారు. భూమి కూడా శుద్ధిగా ఉంటే పంటలు బాగా పండుతాయని వివరించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య ఏపీఎం సుశీల, అధ్యక్షురాలు కోటేశ్వరి,, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాస్టర్ ట్రైనర్ వన్నూరప్ప

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నందిగామ డివిజన్
79950 92114 (నందిగామ)
99122 20547 (జగ్గయ్యపేట)
Office mail : sakshiads@gmail.com